# మనిషి మమత

బీదవాడిమీద ధనికుడి జులుంలా ఉంది ఎండ.

అలాంటి ఎండలో సీతాలుకి కాన్వెంటు స్కూలు వరకు, ఆ మిట్టమధ్యాహ్నం వేళ నడిచి రాక తప్పింది కాదు.

పైన గొడుక్కీ, కింద చెప్పులకీ పటుస్సు చెల్లిపోయినా, అనుబంధం అలాగే నిలిచి ఉన్నది. వాటి అశక్తతను అర్థం చేసుకున్న దానివలె ఓర్పుగా మొహంమీద చెమట అద్దుకుంటూ, నేర్పుగా జారి పోయే చెప్పుల మీద కాళ్ళు నిలుపుతూ గమ్యంకేసి సాగిపోతున్నది సీతాలు.




కాటూరు
రవీంద్ర-త్రివిక్రమ్

గొడుగు పుచ్చుకున్న చేతి కొక సంచీ వేలాడుతూంది.

ఆ సంచీలో చిన్న బాబుకి మధ్యాహ్న భోజనం ఉంది.

ఆ చిన్న బాబు తండ్రి పెద్ద బాబు!

పెద్దబాబు బంగళా, కారు, హోదా గల ఉద్యోగం, చదువుకున్న భార్య కలవాడు.

చిన్నబాబు చదువు కాన్వెంటులో.

సీతాలు చిన్నబాబుని పసిగుడ్డు పర్యంతం పెంచుతున్న ఆయా. ఆ ఇంట్లో వంట బాధ్యత కూడా ఆమెదే. ఆమె చేతి వంట తప్ప మరోటి ముట్టు కోడు చిన్నబాబు.

సీతాలు భర్త రంగూన్ యుద్ధంలో చచ్చిపోయాడు.

అప్పటికి సీతాలు బాగా చిన్నది.

ఆటు తరవాత మరో పెళ్లి తల పెట్టారు కానీ, సీతాలు తల వంచలేదు. మనుషుల మీద, జీవితం మీద తిరగ బడింది కొన్నాళ్ళు. కొన్ని గాయాలు తగిలాయి. మానాయి.

క్రమంగా బ్రతకటానికి అలవాటు పడ్డది.

అప్పుడే జీవితంతో రాజీ అవసర మైంది.

ఆయాగా జీవితంలో స్థిరపడింది.

ఆమె మొహంలో అర్ధనగ్నంగా కద లాడే భావ స్వరూపాలను అంచనా వేసు కొన గలిగితే అంతులేని అనుభవాల సారం, అందుకు ప్రాతిపదిక అయిన అనేక గాథలు ఉన్నట్లు తోస్తాయి.

ఆమెలో ఇప్పుడొకటే మనస్తత్వం నిండి ఉన్నది.

పసిబాలలు, వారి నిర్మలాంతఃకర ణాలు, వాళ్ళ అమాయకపు నవ్వులు, పెన వేసుకుపోయే అనుబంధాల తత్వాలు!

ఇవన్నీ ఒక్కుమ్మడిగా ఆమెను ప్రభా వితం చేసివేశాయి.

ఆ ప్రభావం నుండీ దూరం కావటం ఆమె కిష్టం లేదు.

తను ఏ ప్రాణికీ కన్న తల్లి కాదు.

అయినా, తల్లి వంటిదే!

తల్లికన్నా మిన్నగా ఆలనా, పాలనా చూస్తుంది. వాళ్ళ ఆటల్లో, పాటల్లో కలిసిమెలిసి పోతుంది.

వాళ్ళంతా ఎంతో గొప్పవాళ్ళయిపోవా లని కలలు కంటుంది.


వాళ్ళు తప్పకుండా గొప్పవాళ్ళవుతా రని తనలో తనే మురిసిపోతుంటుంది.

పులిపిల్ల పులే అవుతుంది.

గొప్పవాళ్ళ పిల్లలూ అంతే!

కనీసం ఇది సీతాలు నమ్మకం.

గొప్పవాళ్ళయినాక తనని గుర్తుపెట్టు



మబ్బులతో ముచ్చట

ఫోటో—మధుకర్ వై. పేంద్రే ( కొల్హాపూర్ )

కుంటారా? అన్నేళ్ళు ఆత్మీయత, అను రాగం పంచి ఇచ్చిన ఆయా మీద కనీసం కృతజ్ఞత కళ్ళతో నయినా చూపి స్తారా? లేక తూష్ణీంభావంతో ఈసడి స్తారా?

సీతాలు ఎదలో ఎప్పుడూ ఈ ప్రశ్నలు మెదులుతూ ఉంటాయి.

"బాబూ! పెద్దయ్యాక నేను జ్ఞాపకం ఉంటానా?"

"పెద్ద అంటే?"

"నీకు ఉద్యోగం వచ్చి, కారు మీద తిరుగుతూ ఉంటావే ... అప్పుడు."

మెడచుట్టూ చేతులు వేసి ఊగుతూ, "నా కెప్పుడూ జ్ఞాపకం ఉంటావు నువ్వు" అన్న ఆరేళ్ళ చిన్నబాబు మాట లకు కళ్ళు చెమరుస్తాయి.

మనిషి తన కష్టానికి కోరే ప్రతిఫలం గుర్తింపు!

వీలయితే కృతజ్ఞత.

ఇవి రెండూ లభించిననాడు ఆ తృప్తికి అంతే లేదు!

ఈ పిల్ల లెంత చిలిపివాళ్ళు!

వాళ్ళకి గోరుముద్దలు కావాలి. గోరంత దీపంతో కొండల్ని వెలిగించే నీతి కథలు కావాలి. ఫేదరాసి పెద్దమ్మ కావాలి. రాజకుమారులు ఏడు సము ద్రాలు దాటాలి. బ్రహ్మరాక్షసులతో యుద్ధాలు చెయ్యాలి. మర్రి తొర్రల్లో దాక్కున్న చిలకమ్మల మెడలు పిసికి వాళ్ళను హతం చెయ్యాలి. అరేబియా గుర్రాల మీద రాచనగరుకి తిరిగి వచ్చి అందమయిన రాకుమార్తెలతో అనేక వందల ఏళ్ళు రాజ్యం చెయ్యాలి.

పిల్లల్ని పెంచేవాళ్ళ కివన్నీ తెలి యాలి.

లేకపోతే ఎందుకూ పనికిరారు!

వీటితో బాటు — చందమామని పిలవటం తెలియాలి.

బండిమీద కొండమీద రమ్మనాలి.

'వానా, వానా చెల్లప్పా,' పాడగలగాలి.

నిజంగా ఇదొక రంగుల జీవితం!

వద్దనుకున్నవాళ్ళ వెంట బడు తుంది. కావాలనుకునేవాళ్ళను కనిక రించదు. సంబంధం లేనివాళ్ళను ఆలింగనం చేసుకుంటుంది.

సీతాలు నవ్వుకుంది వేదాంతంగా!

చిన్నబాబుకి జ్వరం వచ్చినప్పటి సంఘటన ఎప్పటికీ తనకి గుర్తు ఉంటుంది. వద్దని వారిస్తున్నా, లెక్క చెయ్యకుండా వానలో గెంతులు వేశాడు. ముద్దముద్దగా తడిశాడు.

మరునాటికి ఒళ్ళెరగని జ్వరం.

డాక్టర్ వచ్చి మందు లిచ్చి, వాడే విధానం వివరించాడు.

"ఏన్నావు గా? జాగ్రత్తగా చూస్తూండు" అంటూ కారులో మహిళా మండలి మీటింగు కెళ్ళిపోయింది కన్న తల్లి, కరుణాదేవి!

మంచంమీద అలా ఉన్న కొడుకుని వదలటానికి మహారాణి సైతం మరో మాటు ఆలోచిస్తుందేమో?

అయ్యగారు కాంపులో ఉన్నారు.

ఢిల్లీలో ఏదో జరుగురు పని!

ట్రంక్‌కాల్‌లో అయ్యగారు పిలిస్తే పలికింది.

బాబు పరిస్థితి చెప్పింది.

"డాక్ట రేమన్నాడు?" అని ప్రశ్న.

డాక్టర్లు చచ్చేవాడికి కూడా బ్రతికి తీరతాడని గారంటీ ఇస్తారు. అది వాళ్ళ వృత్తిధర్మం!

"పర్వాలేదన్నాడు గద? సరే! కరుణ క్లబ్బు కెళ్ళిందా? మళ్ళీ ఫోను చేస్తానని చెప్పు. అవసరం ఉంటే ఇంటోగా ఫోను చెయ్యమన్చెప్పు. బాబుని జాగ్ర త్తగా చూడు." ఫోను కట్ అయింది.

'అమ్మగారికంటే నయం' అనుకుంది సీతాలు మనసులో.

"నా బాబూ! ప్రపంచంలో నీ కెవ్వరూ తోడు లేకపోవచ్చు. ఈ క్షణాన నేను ఉన్నాను" అని మృదువుగా నుదుటి మీద ముద్దిడింది.

పెదవులు కదిలి కళ్ళు తెరిచి, "మంచి నీళ్ళు" అన్నాడు.

గ్లూకోజ్ నీళ్ళు పట్టాక, ఓపికతో "ఆయా! అమ్మ ఎక్కడి కెళ్ళింది?" అనడిగాడు.

అసహాయతలో, బాధలో మనిషికి మొదట జ్ఞాపకం వచ్చేదే అమ్మ! తల్లి పెదవుల్లోని చల్లదనం, మమతలోని మంచి తనం అలాంటివి.

"వస్తుంది, బాబూ! బజారు కెళ్ళింది. నీకోసం బోలెడు బొమ్మలు కొని తెస్తుంది."

అది అబద్ధమే!

కానీ, ఆ మాటలతో చిన్నబాబు కళ్ళలో కనపించిన ఉత్సాహం, వెలుగు అసత్యదోషాన్ని హరించివేయగలవి.

కళ్ళు మూసుకుని పత్తిగిలి పడుకున్నాడు.

మరేమీ ప్రశ్నించలేదు. తల్లి తీసుకు రాబోయే బొమ్మల గురించి ఏవేవో ఊహిస్తూండవచ్చు.

తల్లి వచ్చిన అలికిడికి తల ఎత్తి చూసి, "అమ్మా! బొమ్మలు తెచ్చావా?" అని అలసటగా, చిరాగ్గా ఉన్న తల్లి చేతుల్లో 'పర్సు' మినహా మరోటి కనిపించక దిక్కుమొహం వేశాడు.

"బొమ్మలేమిటి, బాబూ! నన్ను 'మమ్మీ' అనాలని చెప్పలే? కాన్వెంటులో చదివే పిల్లలు 'మమ్మీ' అనాలి— తెలిసిందా? నీకు బొమ్మలు మనింట్లో చాలా ఉన్నాయిగా? మళ్ళీ కొత్తవి కావాలా?"

"వద్దులే, మమ్మీ" అని పడుకున్నాడు మళ్ళీ.

ఆవిడ అటు వెళ్ళాక తనకేసి చూశాడు.

అవి చూపులు కాదు, తూపులు!

ఏమని సంజాయిషీ ఇస్తుంది తను?

ఇందాకటి అసత్య దోషం ఇప్పుడు మేరువంత ఎత్తై, మీద కురికింది.

అటుపైన మరెన్నడూ అలాంటి అబద్ధం చెప్పలేదు తను!

కారు హారనుకి త్రుళ్ళిపడింది సీతాలు.

కాన్వెంటు ముందు ఉన్నది తను!

అలవాటుపడిన పాదాలు పరధ్యానంలో సైతం దారి తప్పవు.

చిన్నబాబు తనకోసం ఆ రావి చెట్టు నీడలో ఎదురు చూస్తున్న గుర్తుగా చెయ్యి ఊపాడు, దూరం నుండే.

ఇంతదూరం నడిచి వచ్చిన శ్రమనీ, తాపాన్నీ మరిచి వేగంగా ముందడుగు వేసింది.

సమీపించగానే ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు.

బుగ్గలు పుణికి, సంచీలోంచి టిఫిన్ కారియర్ తీసి తినటానికి అనువుగా అమర్చింది. ప్రేమతో కొసరి, కొసరి తినిపించింది.

చిన్నబాబు చెయ్యి కడుక్కుంటుండగా కొత్తగా స్నేహితం కలుపుకున్న కుర్రాడొకడు వచ్చాడు.

"మా స్నేహితుడు — కృష్ణ" అన్నాడు చిన్నబాబు పరిచయం చేస్తూ.

కృష్ణ చురుగ్గా — "ఈవిడ మీ అమ్మా?" అన్నాడు.

ఉలిక్కిపడింది సీతాలు.

గుండె దడదడలాడుతుండగా ఏమంటాడో నన్నట్లు ఆత్రంగా చిన్నబాబుని చూసింది.

చిన్నబాబు చిరునవ్వు నవ్వి, "అవును" అన్నాడు స్వచ్ఛంగా.

వెల్లువగా ఉబికి వచ్చాయి కన్నీళ్ళు.

వెల్లడించటం ఇష్టంలేక కారియర్ గిన్నెలు సర్దుతూ మొహం చాటు చేసుకుంది.

మనసులో పొంగిపోతున్న ఆ ఆనందం క్షణికమే కావచ్చు. కానీ, వెయ్యేళ్ళు చెరగని శిలాముద్ర అది!

ఉరుము లేని పిడుగులా కారులోంచి దిగింది కరుణాదేవి!

దిగుతూనే హడావిడిగా— "సీతాలూ! బాబు అన్నం తిన్నాడా?" అంది.

"తిన్నాడమ్మా" అంది వినయంగా.

అంతలో కొడుకు దగ్గరకు వచ్చింది ఆమె.

"కడుపు నిండిందా, బాబూ? ఈ అబ్బాయెవరు?"

"కృష్ణ."

పళ్ళు వెళ్ళబెట్టి నవ్వాడు కృష్ణ. తెల్లగా లేని ఆ పళ్ళు చూడలేక—"సరి... సరి. నాకు టైమయిపోతోంది. సాయంత్రం సీతాలు నిన్ను టాక్సీలో తీసుకెళుతుంది. సరేనా? ఇదుగో, అయిదు రూపాయ లుంచుకో, సీతాలూ! నాకు కారు అవసరం ఉందీవేళ. వస్తా మరి. టా ... టా ... బాబూ" అంది కారులో కూర్చుని.

యాంత్రికంగా చెయ్యెత్తి గాలిలో కదిలించాడు బాబు.

కృష్ణ కౌతుకంగా అడిగాడు: "ఆవిడెవరు?" క్లాసులోకి దారి తీస్తూ, చెవులదరగొడుతున్న గంట మోతని చీలుస్తూ సమాధానం చెప్పాడు బాబు - "మమ్మీ" అని. ★